## క్లుప్తంగా

### నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓ మల్లికార్జున్ బాధ్యతల స్వీకారం



**గుంటూరు ఈస్ట్:** నగరంపాలెం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా కె.మల్లికార్జున్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన ప్రకాశం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. 2023 ఆగస్టులో సీఐగా పదోన్నతి పొంది ఒంగోలు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై నగరంపాలెం పోలీసు స్టేషన్ సీఐగా వచ్చారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**పాత గుంటూరు:** గుంటూరులోని అరండల్‌పేట అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఏడోలైన్‌లోని రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నిచర్ షోరూమ్ ఆవరణలో షోరూమ్ అధినేత పుప్పాళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి వరకు అయ్యప్ప పడిపూజా మహోత్సవం కనులపండువగా జరిగింది. గురుస్వామి శ్రీనివాసన్ నాయర్ నిర్వహణలో రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో ఐదు మండపాలు, తొమ్మిది అభిషేకాలు, 18 కలశాలతో విశేష పూజలు జరిగాయి. డప్పు శీను గురుస్వామి నిర్వహణలో భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప, భవాని, శివ దీక్షాస్వాములు పాల్గొని భజనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

### అప్స రాష్ట్ర కో–చైర్మన్‌గా మేకల రవీంద్రబాబు ఎన్నిక

**నగరంపాలెం:** గుంటూరు ఆర్టీసీకాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఏపీపీఎస్ఏ (అప్స) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అధినేత మేకల రవీంద్రబాబును రాష్ట్ర కో–చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి, రాష్ట్ర నాయకులు సుందరం, వంగా శ్రీనివాసరావు, రమేష్, గుంటూరు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని వెంకట్రావు, పేరిరెడ్డి, కోశాధికారి రాజేష్ నాయుడు, వీఆర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### కళాకారులకు సమాజంలో ప్రత్యేక స్థానం

**ఏఎన్‌యూ:** ఇతర రంగాలకంటే కళారంగం ఎంతో భిన్నమైనదని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజులపాటు జరిగిన నేషనల్ ఫైన్‌ఆర్ట్స్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ కళాకారులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కళలకు సరిహద్దులు, అంతరాలు ఉండవన్నారు. ప్రారంభమైన ఏడాది కాలంలోనే స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఈ ఫెస్ట్‌లో తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొని తమ కళలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. త్వరలో ఏఎన్‌యూలో తమిళం, కన్నడం, మలయాళం, యూరోపియన్ భాషా పరిజ్ఞానం పెంపొందించే డిప్లమా కోర్సు ప్రారంభించనున్నామన్నారు. విద్యార్థులు తమ కోర్సులతో పాటు వీలైనన్ని ఎక్కువ భాషల్లో నైపుణ్యం సంపాదించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### స్టెమ్ పాఠశాలలో న్యాయవాదుల దినోత్సవం

**నగరంపాలెం:** స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో దేశ తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా శనివారం న్యాయవాదుల దినోత్సవం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది కె.రవితేజ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. సైన్స్, గణితంతోపాటు సాంఘిక శాస్త్రంలో కూడా రాణించాలని చెప్పారు. సమాచార నైపుణ్యాలను పెంపొందించుకున్నట్లయితే ఉత్తమ పౌరులుగా మారతారని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వైద్యులు, ఇంజినీర్లతోపాటు న్యాయవాదులుగా రాణించాలని అన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ జయశీలి, ఉపప్రధానోపాధ్యాయురాలు వి.రమాదేవి, వై.మోనిక, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఫెస్ట్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల విద్యార్థులకు సరిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన బినీత్ వ్యాస్

**గుంటూరు ఎడ్యుకేషన్:** నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఎన్నారై జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థి బాలిశెట్టి బినీత్ వ్యాస్ కాంస్య పతకాన్ని సాధించినట్లు కళాశాల సీఈఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బినీత్ వ్యాస్ బృందం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ యూత్ విభాగంలో 1871.3 పాయింట్లు సాధించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. నాగచౌదరి పాల్గొన్నారు.

# ఆలోచన దివ్యం.. అభివృద్ధి పథం

- దివ్యాంగుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు
- 2019 నుంచి 2023 వరకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా 50 మందికి వివిధ శాఖల్లో ఉద్యోగాలు
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 10 చొప్పున రూ.65లక్షల విలువైన 70 మోటరైజ్డ్ త్రీ వీలర్లు అందజేత
- 1031 మంది లబ్ధిదారులకు రూ.70లక్షల విలువైన ఉపకరణాలు అందజేత



దివ్యాంగులకు వీల్ చైర్లను అందజేస్తున్న జేసీ రాజకుమారి, అధికారులు (ఫైల్)

**నెహ్రూనగర్:** వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుంది. వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రతి ఏడాది జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందజేస్తున్నారు. జీవితంలో ఎదిగేందుకు అంగవైకల్యం అడ్డుకాదని, ఏదైనా సాధించగలమనే నమ్మకం కల్పించి ఆత్మస్థైర్యం నింపేలా క్రీడల పోటీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులైన విద్యార్థులకు మరింత చేయూతనందిస్తూ సాంకేతికంగా అవసరమైన ఉపకరణాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

**ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో...**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా 50 మంది దివ్యాంగులకు వివిధ శాఖల్లో ఉద్యోగాలు కల్పించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 10 చొప్పున రూ.65లక్షల విలువైన 70 మోటరైజ్డ్ త్రీ వీలర్ స్కూటర్లు పంపిణీ చేశారు. అదే విధంగా ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ(నేషనల్ హ్యాండీక్యాప్డ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా స్వయం ఉపాధి కోసం రూ.37లక్షలు 8 మంది దివ్యాంగులకు మంజూరు చేయడం జరిగింది. 1031 మంది లబ్ధిదారులకు రూ.70లక్షల విలువైన ఉపకరణాలు(ల్యాప్‌టాప్‌లు 109, టచ్ ఫోన్‌లు 120, ట్రై సైకిళ్ల 250, చక్రాల కుర్చీలు 95, వినికిడి పరికరాలు 107, బ్లైండ్ స్టిక్స్ 28, వృద్ధుల వాకింగ్ స్టిక్స్ 267) ఉచితంగా అందజేయడం జరిగింది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 24,988 మంది దివ్యాంగ పెన్షన్ పొందుతున్నారు.



మోటరైజ్డ్ స్కూటర్‌ను దివ్యాంగుడికి అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి(ఫైల్)

### నేడు దివ్యాంగులకు క్రీడా పోటీలు



నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఉపకరణాలు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశాల మేరకు పారదర్శకంగా అందజేస్తున్నాం.

– సీహెచ్ సువార్త, అసిస్టెంట్ డైరెక్టర్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ

# ‘ఆడుదాం ఆంధ్ర’తో ఉజ్వల భవిష్యత్తు

- ఆసక్తి కల్గినవారు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

**నెహ్రూనగర్:** క్రీడలపై ఆసక్తి కలిగిన యువతకు ఆడుదాం ఆంధ్ర ద్వారా మంచి అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ఆసక్తి గల వారు అందుబాటులోని వార్డు సచివాలయాల్లో తమ పేరు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 15 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర ద్వారా 15 ఏళ్ల పైబడి క్రీడలపై ఆసక్తి ఉండి, అవకాశం కోసం ఎదురు చూసే వారికి రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక్కో క్రీడాకారుడు గరిష్టంగా 2 ఆటల్లో పాల్గొనవచ్చని, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనకూడదన్నారు. గుంటూరు నగర పరిధిలో వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో క్రీడలపై ఆసక్తి ఉన్న వారి నుంచి వివరాలు తీసుకొని ఆన్‌లైన్ చేస్తున్నారని, డిసెంబర్ 13 వరకు రిజిస్ట్రేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. 15 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి రూ.20వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు, రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 లక్షలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.2 లక్షలు నగదు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. నగర యువత పెద్దఎత్తున పాల్గొని గుంటూరు నగరానికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.

**పోలింగ్ బూత్‌ల తనిఖీ...**

**నెహ్రూనగర్:** ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో బీఎల్‌ఓలు పోలింగ్ బూతుల్లో నిర్దేశిత సమయం వరకు అందుబాటులో ఉంటూ ఓటర్లకు అవసరమైన దరఖాస్తులు అందించడం, వారి నుంచి తగిన వివరాలు పూర్తిచేసిన దరఖాస్తులు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు ఈ.ఆర్.ఓ. కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శనివారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని 532 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ శిబిరాలను కమిషనర్, ఏఈఆర్‌ఓలు పరిశీలించారు. బొంగరాలబీడు ఉర్దూ స్కూల్, కొత్తపేట ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ లోని పోలింగ్ బూతుల్లో బీఎల్‌ఓల పనితీరును ఆకస్మిక తనిఖీ చేసి, రిజిస్టర్లు, గుర్తింపు కార్డులు, దరఖాస్తులను పరిశీలించారు. ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ 108 నంబర్ పోలింగ్ బూత్ బీఎల్ఓ ఎన్.సంగీతరావు బీఎల్ఓ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సూపర్‌వైజరీ అధికారులు తమ పరిధిలోని బీఎల్‌ఓల హాజరు, పనితీరును పర్యవేక్షణ చేయాలని, పని తీరు సరిగా లేని బీఎల్‌ఓలపై చర్యలకు నివేదిక సిఫార్సు చేయాలన్నారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉన్నదీ, లేనిదీ స్వయంగా పరిశీలించుకోవాలన్నారు. జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదలకు ఎన్నికల సంఘం గడువు ప్రకటించినందున, ఓటర్ల జాబితా ముసాయిదా సవరణకు ఇదే ఆఖరి అవకాశమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజరీ అధికారులు సేతుబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### పోలీస్ కుటుంబాలకు చెక్కులు పంపిణీ



**నగరంపాలెం:** ఇటీవల జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) మాధవస్వామి, ఫిరంగిపురం పీఎస్ కానిస్టేబుల్ ఎస్.రాజేష్‌లు వేర్వేరుగా అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఈ క్రమంలో కార్పస్ ఫండ్ కింద ఒక్కొక్కరికి మంజూరైన రూ.లక్ష చెక్కులను మాధవస్వామి కుమారుడు సదానందంకు, రాజేష్ భార్య జ్యోతికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందజేశారు.

### నేడు నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం వన సమారాధన

**నెహ్రూనగర్:** నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం కార్తిక వన సమారాధన(షష్ఠమ) ఆదివారం పేరేచర్ల నగరవనం పార్కు పక్కన, గుప్తా మామిడితోటలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అడపాబజార్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం యొక్క ఐకమత్యం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నవ్యాంధ్ర దాసు సంఘీయులతో కలిసి కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చెవుల కోటి రామాంజనేయులు, వీధి పాండు రంగ నాయకస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రూ.10.50 లక్షల ఉపకార వేతనాలు అందజేత



**నగరంపాలెం:** ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించి, మంచి స్థానాల్లో స్థిరపడాలని విద్యాదాతలు నూతక్కి రామకృష్ణ ప్రసాద్, సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. నూతక్కి రామకృష్ణప్రసాద్ తన జన్మదినోత్సవం సందర్భంగా శనివారం బృందావన్‌గార్డెన్స్ కుందులరోడ్‌లోని కమ్మజన సేవా సమితి ఆవరణలో కుల మతాలకు అతీతంగా 150 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.10.50 లక్షల చెక్కులను అందజేశారు. ఒక్కొక్క విద్యార్థి రూ.7 వేలు చొప్పున చెక్కులు అందజేయగా, సంపదను విద్యా సంస్థలకు వితరణగా అందజేస్తానని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు వందలాది మంది విద్యార్థులకు రూ.35 లక్షల వరకు ఉపకార వేతనాలను పంపిణీ చేసినట్లు కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు తెలిపారు. సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్యచౌదరి, సంయుక్త కార్యదర్శులు గుంటుపల్లి కోటేశ్వరరావు, మద్రిపూడి సీతారామయ్య, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు పాల్గొన్నారు.

### స్టీరియో టాక్టిక్ రేడియోసర్జరీతో క్యాన్సర్ పూర్తిగా తగ్గించవచ్చు

ఒమేగా హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జి.నాగకిషోర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, పక్కన పలువురు వైద్యులు

**గుంటూరు మెడికల్:** స్టీరియో టాక్టిక్ రేడియోసర్జరీతో క్యాన్సర్ వ్యాధిని పూర్తిగా తగ్గించవచ్చని ఒమేగా హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి. నాగ కిషోర్ అన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణలో ప్రపంచంలోనే ఒక అత్యాధునికమైన రేడియో థెరపీ టెక్నిక్‌ను గుంటూరులోని తమ హాస్పటల్‌లో పలువురు రోగులకు ఉపయోగించి క్యాన్సర్‌ను తగ్గించామన్నారు. శనివారం గుంటూరులోని ఒమెగా హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో మొట్టమొదటిసారిగా 300 మందికి పైగా అత్యాధునిక చికిత్స విధానంలో తమ హాస్పటల్‌లో క్యాన్సర్ రోగులకు చికిత్స అందించామన్నారు. స్టీరియో టాక్టిక్ రేడియోసర్జరీ ట్రీట్మెంట్ అంటే 1 నుంచి 5 రోజుల్లోపు క్యాన్సర్ రోగికి ఇచ్చే రేడియేషన్ ట్రీట్మెంట్ అని పేర్కొన్నారు. మామూలుగా రేడియేషన్ ట్రీట్మెంట్ 5 నుంచి 8 వారాలు ఇస్తారని, స్టీరియో టాక్టిక్ రేడియోసర్జరీ ట్రీట్మెంట్ స్పెషలైజ్డ్ ఎక్విప్మెంట్ ద్వారా కేవలం ఐదు రోజుల్లోపు ట్రీట్‌మెంట్ ఇస్తామని వెల్లడించారు. నూతన చికిత్స విధానం ద్వారా పేషెంట్ తొందరగా కోలుకొని తన పనులు తాను తొందరగా చేసుకోగలుగుతారన్నారు. మన దేశంలో అతి తక్కువ క్యాన్సర్ సెంటర్‌లలో మాత్రమే ఈ ట్రీట్మెంట్ అందుబాటులో ఉందన్నారు. ఈ చికిత్స విధానం సూక్ష్మ దశలో ఉన్న క్యాన్సర్‌కి ముఖ్యంగా సున్నితమైన ప్రదేశాల్లో లివర్, ఊపిరితిత్తులు, వెన్నెముక, ప్రోస్టేట్, బ్రెయిన్ క్యాన్సర్‌కి వాడతారని చెప్పారు. స్టీరియో టాక్టిక్ రేడియోసర్జరీ ట్రీట్మెంట్ క్యాన్సర్‌కు మాత్రమే కాకుండా కొన్ని అరుదైన ట్యూమర్లు, మెదడులో వచ్చే సమస్యలు, సర్జరీ చేయలేని ప్రదేశాల్లో ఉండే ట్యూమర్స్‌కి వినియోగిస్తారన్నారు. దీని వలన ప్రాణాపాయం ఉండదని, శరీరంలో ఏ భాగంలో క్యాన్సర్ వచ్చిన అతితక్కువ జబ్బు వున్న వాళ్లకి వినియోగిస్తారని పేర్కొన్నారు. ఈ ట్రీట్మెంట్ కొరకు తమ ఆసుపత్రికి నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి నుంచి పేషెంట్స్ వస్తున్నారన్నారు. చికిత్స కోసం అత్యాధునిక ఎలక్టా వెర్సా హెచ్‌డీ విత్ ఏజిలిటి ఎంఎల్‌సీ 160 మిషన్ వినియోగిస్తున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సలో నిపుణులైన రేడియేషన్ డిపార్టుమెంట్ వైద్యులు డాక్టర్ ఎస్.వి.ఎస్.ప్రవీణ్, డాక్టర్ ఎస్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.గీతారుక్మిణి ఉన్నట్లు వెల్లడించారు. తమ హాస్పిటల్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, అన్ని కంపెనీల ఇన్సూరెన్సులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు హెల్త్ కార్డులపై ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.

### ఆన్‌లైన్ మోసంపై కేసు

**గుంటూరు ఈస్ట్:** ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టిన యువతి మోసపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్రనగర్‌కు చెందిన యువతికి గతనెల 16న వాట్సాప్‌లో లింక్ వచ్చింది. యువతి వాట్సాప్ లింక్ ఓపెన్ చేసింది. అందులో అవతల వ్యక్తి చెప్పిన ప్రకారం పలు మార్లు రూ. 6 లక్షలు పెట్టుబడి పెట్టింది. అనంతరం మోసపోయినట్లు గుర్తించి శనివారం బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఘనంగా జిల్లా సంగీత కళాకారుల సంఘం వార్షికోత్సవం

**పాత గుంటూరు:** అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం 12వ వార్షికోత్సవం, అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన సభకు విశ్రాంత సేల్స్ టాక్స్ డెప్యూటీ కమిషనర్ కె.చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐజీ ఎ.రవిచంద్ర, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.రవికుమార్, మేకల రవీంద్రబాబు, డాక్టర్ ఎం.ఫణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా స్కూల్స్ అధినేత కన్నా మాస్టారు, సంగీత గురువులు ఏం.ఎస్.బాబులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయకులు మల్లేశ్వరరావు, సుధీర్, సుబ్రహ్మణ్యం, రత్నం, గాయత్రీ, శైలజ పాటలు ఆలపించారు. కార్యక్రమాలను సంస్థ ఉపాధ్యక్షులు జేమ్స్ పాండే, సహాకార్యదర్శి బి.బాలస్వామి పర్యవేక్షించారు.

# అణగారినవర్గాల ప్రగతికి సీఎం కృషి

- ఈనెల 7న గుంటూరు చుట్టుగుంటలో సామాజిక సాధికార బస్సుయాత్ర
- శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విప్ అప్పిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

**పట్నంబజారు(గుంటూరు ఈస్ట్):** భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ధైర్యంగా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీలు అనలేదని, సమాజంలో అణగారిన వర్గాల మార్పు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టడుగు వర్గాల పక్షాన నిలిచారని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఈ నెల 7వ తేదీన గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందని తెలిపారు. పట్టాభిపురంలోని షాదీఖానాలో ‘సామాజిక సాధికార బస్సు యాత్ర’ సన్నాహక సమావేశం జరిగింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు, కార్పొరేటర్‌లు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్లు, డివిజన్ అధ్యక్షులు హాజరయ్యారు. విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఎటువంటి పరిపాలన కొనసాగిందో చూశామని, సీఎం వైఎస్ జగన్ పరిపాలన చేపట్టిన నాటి నుంచి పార్టీ పరంగా, నామినేటెడ్ పదవుల్లో రాష్ట్రంలో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వాటా కల్పిస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ల పాలనలో మంచి చేశారు కాబట్టే.. మంచి చేస్తేనే ఓటు వేయండని సీఎం జగన్ ధైర్యంగా అడుతున్నారన్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందజేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలన మేలు జరిగిన ప్రతి ఒక్కరిని సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగస్వామ్యులను చేసే ముందుకు సాగాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించాలని, బస్సు యాత్ర ఎందుకు జరుగుతుందో తెలియజేయాలన్నారు. అగ్రవర్ణ పేదలకు సైతం అండగా ఉంటూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన సాగుతోందన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించే ఒడుకే సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతోందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే నైజం తనదని సీఎం వైఎస్ జగన్ చాటిచెప్పారన్నారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళుతూ.. ప్రతి గడప ముంగిటకు సంక్షేమాన్ని దరిచేర్చారన్నారు. ప్రతిపక్షాల చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు చుట్టుగుంటలో బస్సు యాత్ర, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ 7న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), డిప్యూటీ మేయర్‌లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, పార్టీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్‌లు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు సినీ సంగీత విభావరి

**పాత గుంటూరు:** అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం స్వరాల సంగమం పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు మధువని సాంస్కతిక సంస్థ అధ్యక్షుడు వి.మధుబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు సినిమా పాటలు ఆలపిస్తారని సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

### 10న ప్రతిభా పురస్కారాల ప్రదానం



ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించిన రంగారావు, బాలస్వామి

**పాత గుంటూరు:** రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఈ నెల 10వ తేదీన కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, మహాదాత ఆళ్ళ దశరథరామిరెడ్డి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. శనివారం అరండల్ పేటలోని కార్యాలయంలో సమావేశంలో పురస్కారాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ పదో తేదీన సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభలో ప్రముఖ సినీనటి సుధకు మహానటి సావిత్రి పురస్కారం, గాయకులు చంద్రతేజ, కె.ప్రవీణ్ కుమార్, కాట్రగడ్డ శ్రీనివాసుడు, సత్యానంద్, జయశ్రీ ప్రభ్య, శైలజ, మాధవి, ఇందునైనలు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ముందుగా ఘంటసాల గానామృతం పేరుతో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సంస్థ సభ్యులు వై.హేమమాలిని, బి.పావని, బాలస్వామి, బాబూరావు, రాజశేఖర్, చంద్రబాబు పాల్గొన్నారు.

### జీజీహెచ్ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వైద్య పరికరాన్ని అందజేస్తున్న దాతలు

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కోసం రూ. కోటి విరాళం ఇచ్చేందుకు దాత ముందుకు రావడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఏపీ ఎంఎస్ఐడీసీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్తయ్య ఆధ్వర్యంలో హర్షిత రియల్ ఎస్టేట్ అధినేత కిరణ్ ఆసుపత్రికి రూ. 30 వేల రూపాయలు విలువ గల పరికరాన్ని డాక్టర్ కిరణ్ కుమార్‌కు అందచేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో బైపాస్ ఆపరేషన్ చేయాలంటే కనీసం రూ. 10 లక్షలు తీసుకుంటున్నారని, జీజీహెచ్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా గుండె బైపాస్ ఆపరేషన్‌ను చేస్తున్నట్లు వెల్లడించారు. కార్డియోథొరాసిక్ విభాగానికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

### తుఫాన్ కారణంగా పలు రైళ్లు రద్దు

**లక్ష్మీపురం:** సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మిచౌంగ్ తుఫాన్ కారణంగా పలు రైళ్ల రద్దు చేయడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం తెలిపారు. సికింద్రబాద్–కొళ్ళం(07129) రైలు ఈనెల 3వ తేదీన రద్దు చేయడం జరిగిందని తెలిపారు. కొళ్ళం–సికింద్రబాద్(07130) రైలు ఈనెల 5వ తేదీన, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–విజయవాడ(12077) రైలు ఈనెల 3,4వ తేదీలలో, విజయవాడ–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12078) ఈనెల 3,4, తేదీలలో, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హైదరాబాద్(12603) ఈనెల 3,4,5వ తేదీలలో, హైదరాబాద్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12604) ఈనెల 4,5,6 తేదీలలో, తిరుపతి–లింగంపల్లి(12733) ఈనెల 3,4,5 తేదీలలో, లింగంపల్లి–తిరుపతి(12734) ఈనెల 4,5,6 తేదిలలో, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–లక్నో(16093) రైలు ఈనెల 5వ తేదిన, లక్నో–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(16094) రైలు ఈనెల 7వ తేదీన, సికింద్రబాద్–త్రివేండ్రం(17230) ఈనెల 3,4,5 తేదీలలో, త్రివేండ్రం–సికింద్రబాద్(17229) ఈనెల 5,6,7 తేదిలలో, చంగలపట్టు–కాకినాడ పోర్ట్(17643) రైలు ఈనెల 3,4,5 తేదీలలో, కాకినాడ పోర్ట్–చంగలపట్టు(17644) రైలు ఈనెల 3,4,5 తేదీలలో, సికింద్రబాద్–తిరుపతి(20701) రైలు ఈనెల 3,4 తేదీలలో, తిరుపతి–సికింద్రబాద్(20702) రైలు ఈనెల 3,4 తేదీలలో తిరుపతి–విశాఖపట్నం (22708) రైలు ఈనెల 3వ తేదీన, విశాఖపట్నం–తిరుపతి(22707) రైలు ఈనెల 4వ తేదీన రద్దు చేయడం జరిగిందని, ప్రయాణికులు గమనించాల్సిందిగా తెలియజేశారు.